


వలివేటి నాగచంద్రావతి

మినుకు మినుకు మంటున్న దీపమది.

దానివంక ఆశగా చూస్తోంది శారద. ఆమె జీవితంలో కారుమబ్బులు కమ్ముకున్న వేళ అది. దీపం వెలాతెలా పోతోంది.

కొడిగట్టిన దీపం ఎన్నాళ్లయి వెలుగుతుంది? ఒక్కసారి గుప్పున వెలిగి టప్పున కొండెక్కింది. ఆమెను గాఢాంధకారంలో ముంచేస్తూ.

పరంధామయ్యగారి జీవాలు అనంతాకాశంలో లీనమయినాయి. శోకాలు మిన్నంటుతున్న ఆ వాతావరణంలో తడిలేని కళ్లతో శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది శారద. కంటిలో నీరే కాక ఒంటిలో రక్తం కూడా హరించుకుపోయిందేనాడో ఆమెకు.

పదిరోజులపాటు ఇంట్లోవున్న సంభారమంతా ఖాళీచేసిన బంధు బలగమంతా, పనికిరాని సానుభూతిని ఒలకబోసి చేతులు దులుపుకు చక్కాబోయారు.

నిన్నటివరకూ 'నాది' అనుకున్న ఇల్లంతా చట్టప్రకారం తమ స్వంతం చేసుకుంటూ, నడివీధిలో నిలబెట్టారన్న నింద లేకుండా, ఒక గదిపెట్టు ఇంటిలో చోటు చూపించి, చెంబొకవందా చేతులో పెట్టి తప్పుకున్నారు కొడుకు లిద్దరూ.

నిజమే మరి! కడుపున పుట్టిన బిడ్డలకే మమకారాలు చచ్చిపోతున్న ఈ రోజుల్లో సవితి కొడుకులమీద అంతకన్న ఆశపెట్టుకోవడం అవివేకమే.

ముగ్గురాడపిల్లలతో నలిగిన మనస్సుతో మిగిలింది శారద.

పాతికేళ్లన్నా నిండని తననా రెండు వందలూ ఎన్నాళ్లని ఆదుకుంటాయి? ఆ తరవాత తనకి దిక్కెవ్వరు? తన పిల్లల గతేమిటి? లెక్కలేనన్ని ప్రశ్నలు. సమాధానం చూపుమేర దూరంలో కనిపించని ప్రశ్నలు నిలవేస్తున్నాయి శారదని.

బాల్యంలో పోషించవలసిన తల్లీతండ్రీ, దాన్ని దాటించేసరికే తల మున్కలయి, పాతబడిన పడవలో తన జీవితాన్నుంచి బాధ్యత ఒదుల్చుకున్నారు.

యవ్వనంలో ఆదుకోవాలిసిన భర్త మధ్యలోనే చెయిజార్చి తన త్రోవ తను చూచుకుని మాయమై చక్కాబోయాడు.

మరి వృధాప్యాన్ని దాటించాల్సిన కొడుకులసలు తనకు లేనే లేరు!

తాను నిస్సహాయ. కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న ఈ కటిక వాస్తవానికి తట్టుకోలేక కళ్లనీరు నింపుకున్నది శారద. పెళ్లయిన ఆరేళ్లలో ముగ్గురు ఆడపిల్లల్ని కని పాతికేళ్లకే 'శారదమ్మ' అయిన శారద.

చెల్లెల్ని ఓదార్చడానికి వచ్చిన భాగ్యమ్మ శారదను పట్టుకుని బావురుమంటూ,

'నన్ను నట్టేట్లో ముంచి పొయ్యాడే' అంటూ పోయిన మరిదిని నిందించబోయింది.

'ఆయనెందుకంటావూ? నాకి దశ పడుతుందని ముందు మీకూ నాకూ తెలియదంటావా ?' అంటూ నిర్లిప్తంగా వారించింది.

ఆ కంఠంలో, 'ఈ అన్యాయంలో నీపాలు కూడా వుందన్న ధ్వని వినిపించి క్షణం స్తంభించిపోయింది భాగ్యమ్మ. అంతలో తెప్పరిల్లి కలవరపాటుని కప్పిపుచ్చుకుంటూ, 'పోనీ ఆ ఇల్లంతా అయినా నీపేర పెట్టించుకున్నావా...?' మా తప్పూ వున్నదనుకో, మరి నీ తెలివితేట లేమయ్యాయి? అన్న చురుకు ఆ మాటల్లో నింపింది భాగ్యమ్మ.

అక్కగారి ఎత్తిపొడుపుకి సమాధానంగా 'మృత్యువు చెప్పి రాదు అందరికీ' అన్నది శారద విరక్తిగా.

ఏభైనాలుగేళ్ల పరంధామయ్యగారు కలక్టరాఫీసు హెడ్ గుమాస్తాగా రిటైర్ కాకముందే, హటాత్తుగా పక్షవాతం వచ్చి కాలూ, చెయ్యే కాకుండా, నోరు గూడా పడిపోయి, మూడురోజులు మంచంమీద వుండి, ఎవరికీ ఏమీ చెప్పలేని స్థితిలో కన్నుమూశారు.

పరంధామయ్యగారి మొదటి భార్య ఏనాడో గతించింది. తండ్రి చాటున రెక్కలు తెచ్చుకున్న కొడుకు లిద్దరూ కోడళ్లు రాగానే గూడు వదిలిపెట్టి వేరుపడటంతో ఒంటరివాడైనాడు పరంధామయ్య.

పరంధామయ్యకి ఇంట్లో నాలుగు మెతుకులుడకేసి పెట్టే ఆడదిక్కు లేక పోయింది. ఆయన ఒంట్లో జవసత్వాలూ ఉడగలేదు. ఒంటరిగా బ్రతుకీడ్చాలంటే కష్టమే పాపం! ఒక స్నేహితుడి సలహా మీద శారదని చూడటం తటస్థించింది.

తనకా ఇంకా పదేళ్లు వుద్యోగపు గడువున్నది. జుట్టు నెరవడం ప్రారంభమైనా శరీరపటుత్వమేమీ తగ్గలేదు. కాయపారు మనిషేమో ఏభయ్యోపడి దగ్గరపడినా, అంతవయస్సున్నవాడిలా కనిపించడు.

శారద కూడా ఏపుగా ఎదిగి కాలుబారు పిల్ల అవటాన, పద్దెనిమిదేళ్లదయినా పాతికేళ్ల యువతిలా కనిపిస్తుంది. అందుచేత, తనవల్ల ఆ అమ్మాయికేమంత అన్యాయం జరగబోదు అన్న ధీమాతోనే శారద మెళ్లో తాళిగట్టాడు పరంధామయ్య.

దేవుడు మేలు చేసి తనకు మరి రెండు కాయలు కాచినా, పెద్దవాళ్ల పూచీ తనకిక లేదు గాబట్టి, మిగిలినదంతా వీళ్ల పరమే అవుతుంది కదా అనుకున్నాడు కూడా.

కాని భగత్సంకల్పం వేరుగా వుంది.

* * *

తండ్రీ మళ్లీ పెళ్లి చేసుకోవడంతో ఆస్తిమీద ఆశలు పెంచుకోలేదు కొడుకు లిద్దరూ. సవితి తల్లికీ, ఆమె సంతానానికే రాస్తాడు విల్లు అనుకున్నారు.

కాని పరంధామయ్య తన సంకల్పాన్ని కాగితమ్మీద పెట్టకముందే, ఆయన చెయ్యీ నోరూ పడిపోయినై. దానితో కొడుకులిద్దరికీ స్వార్థం తలెత్తింది. చేజిక్కిన దాన్ని జారవిడుచుకుని సవితి తల్లికీ, సవితి చెల్లెళ్లకీ ఆస్తి ఒదిలేంత వుదారం లేదు వాళ్లకి.

ఇల్లు తండ్రికి పిత్రార్జిత మంటూనూ, పొలం తమ తల్లి పసుపుకుంకానికి ఇచ్చిందంటూనూ స్వాధీనం చేసుకున్నారు కొడుకులు.

మారు మాటాడలేదు శారద. తనమాట చెల్లదు. కాని ఆమెకు తెలుసు; పరంధామయ్య చెబుతూ వుండేవాడు. తండ్రి ఇచ్చిన స్థలంలోని మట్టికొంప పడగొట్టించి తన రెక్కలమీద ఇంత దిట్టమైన డాబా ఇల్లు కట్టించానని సగర్వంగా చెప్పుకునే వారాయన.

'ఇదొక్కటమ్మితే చాలోయ్ మన అమ్మాయిల పెళ్లిళ్లన్నీ గట్టెక్కించడానికి! పొలంమీద అయివేజొస్తుంది. రిటై

రయ్యానా సన్ననౌస్తుంది. దానా దీనా మన జీవితాలు చీకూ చింత లేకుండా వెళ్ళిపోతాయి' అని లెక్కలు కడుతూ సంతృప్తి వెళ్ళబోశేవాడాయన.

ముందు ముప్పు తెలుసుకోగలగటం ఏంతటివారికీ శక్యం కాదు.

భర్త చనిపోయేముందు, ఆయన మాట రాక, కళ్ళతోనే తనకోసం పడిన ఆవేదనమూ, కొడుకులకు ఏదో చెప్పి పోవాలన్న ఆరాటాన్ని తాను గ్రహించింది. కాని ఆ కళ్ళలోని భాషను అనువదించి చెప్పినా తనను నమ్మేదెవరు? జరగబోయేది జరగనిమ్మని, పరిస్థితులకి తలవంచి చూస్తూ వూరుకున్నది శారద.

భాగ్యమ్మ వెదుతూ వెదుతూ, 'ఈ పసివాళ్ళతో ఎలా వేగ గలవు?' ఆ గది కాస్తా అద్దెకిచ్చి నాన్నదగ్గరికే వెళ్ళు. వాళ్ళకు తప్పుతుందా!' అన్నది.

'చూస్తాను.' అన్నది శారద ముభావంగా.

కాని ఆమెకు పుట్టింటికి వెడదామన్న ఆలోచనే లేదు. వెళ్ళి అక్కడ బావుకునేదేమీ లేదు. రోగిష్టి తల్లి, ఇంకా పెళ్ళి కావాల్సిన చెల్లెలూ, తండ్రి గుండెలమీద కుంపట్లయి వున్నారు ఇప్పటికే. వాళ్ళిద్దరికే సరిగా కూడు పెట్టలేని సంపాదన ఆయనది. ఇక తానుగూడా వెళ్ళి ఎలా ఆ ముసలాయనమీద మరింత భారం మోపగలదు?

# అబల

తన బ్రతుకు తెరువు తాను వెతుక్కోవలసిందే తప్పదు.

ఒక సవితి కొడుకు ఫానూ, మరో సవితికొడుకు రేడియో తీస్కెసుకోగా మిగిలింది పాత్రసామానూ, మంచాలూ కుంచాలూను. తన నిత్యావసరాలకి ఏవో చిన్న చిన్న పాత్రలూ, పళ్ళాలూమాత్రం వుంచుకుని మిగతావన్నీ ఎలా వీలయితే అలా అమ్మేసింది. అమ్మబోతే అడివి— కొనబోతే కొరివి. ఏ వస్తువుకీ కొన్నధరలో పదోవంతురాలేదు. ఎన్ని శాలీలమ్మినా వచ్చినది నాలుగ్గైదు వందరూపాయలు మాత్రమే. తన బ్రతుక్కి భవిష్యత్తుకి ఆధారం చూపించాల్సినవి ఆ నాలుగ్గైదు వందలే. ఎలాగయితేనేం ఒక కుట్టుమిషను కొనుక్కున్నది.

*        *        *

తెలతెలవారుతోంది. అంధకారమింకా వెలుగురేఖల ఆధిపత్యాన్ని అంగీకరించినట్టులేదు. వుండీ వుండీ కాకులు మాత్రం 'కావు—కావు'మంటూ వేడుకుంటున్నాయి ఎవరినో.

నిద్రమత్తు వదలని కళ్ళు చన్నీళ్ళతో కడుక్కుని కుట్టుమిషను ముందు కూర్చున్నది శారద. లాంతరుదీపం మసక వెలుతుర్లో సూదిలో దారం ఎక్కక మారాం చేస్తోంది.


మొదట్లో 'అలవాటు లేని అప్రపోసనంలా' ఎప్పుడో సరదాగా నేర్చుకుని మర్చిపోయిన విద్యను బలవంతాన గుర్తుకు తెచ్చుకుంటూ కుట్టబోతే, వెనక్కేగాని ముందుకు తిరగనని మొరాయించేది చక్రం. క్షణక్షణం దారం తెగుతూ తన వోపికను పరీక్షకు పెట్టేది మిషన్. కాళ్ళు లాగి కాస్సేపటికే అలిసిపోయేది తాను. ఇప్పుడు చాలా నయం.

అందరూ కుట్టేదానికన్నా ఓ అణా తగ్గిస్తానని ఆశబెట్టి తెచ్చిన ఇరుగు పొరుగు వాళ్ళబట్టలన్నీ చేతగాక చెడగొట్టి, వాళ్ళు పెట్టే చివాట్లన్నీ దిక్కుమొహం వేసుకుని తినాల్సివచ్చేది కొన్నాళ్ళు. మరీ గడుసువాళ్ళ పోరు పడలేక, కొత్తగుడ్డలు కొని ఇచ్చేసి బెడద వదలించుకుని, తన చేతగానితనానికి నిస్పృహ చెందిన రోజులూ వున్నాయి.

చదువూ సంధ్యాలేని తన మనుగడకు తాను వెతుక్కోగలిగిన ఆధారం అదొక్కటే. కాబట్టే అవమానాలు ఎదురైనప్పుడు తల ఒంచుకుంటూ, అవరోధాలొచ్చినప్పుడు తప్పించుకుంటూ, ఎలాగయితేనేం ఇప్పుడిప్పుడే ఓదారిన పడ్డది. 'బాబిను'కి దారం పోస్తూ గడిచిన రోజులు తలుచుకుని నిట్టూర్చింది శారద.

'ఈ నాలుగుజాకెట్లూ కుట్టి చేతులో పెడితేగాని ఇవ్వాలిసిన రెండురూపాయలూ ఇవ్వనన్నది ఎదురింటావిడ. ఆ రెండు రూపాయలైనా తెచ్చి పెరుగమ్మి కాతాలో జమ కడితేనే తప్ప, ఈరోజు పిల్లల కంచాలలోకి మజ్జిగ నీళ్ళమరవు. ఈ పూటకి బియ్యం సరిపోవచ్చు, కాని రాత్రికి తక్కువవుతాయి. తన స్థితిగతులెరుగున్న ఏ ఇరుగు పొరుగావిడ తనకు అప్పు పెట్టదు. పోనీ కుట్టాల్సిన జాకెట్లూ, గట్లా ఏవయినా ముగించియిచ్చి సొమ్ము తెచ్చుకుందామన్నా అవీ లేవు. ఈ నాలుగు జాకెట్లూ తప్ప. మరెలా? తానొక్కతే అయితే మూడంకె వేసి ముడుచుకు పడుకోగలదు. మరి పిల్లలెలా ఆపడం? ఏకాస్తయినా కడుపు దాచుకోవడం తెలియని వయస్సు వాళ్ళది!

పూర్తిగా తెల్లవారింది. కుట్టడం పూర్తిచేసి లేచింది శారద. 'మిషన్'మీద దుప్పటికప్పి, కుట్టిన నాలుగు జాకెట్లూ



ముడిచి, 'అది' జాకెట్టులో చుట్టి పెట్టింది.

పెద్దపిల్లలిద్దరూ లేచి దగ్గర కొచ్చారు. వంటింటి పొయ్యాలలో మసులుతుంటే ఒక్కపూపు వేసి పిల్లలిద్దర్నీ తీసుకుని పెరట్లోకి వచ్చింది. వాళ్ళిద్దరి మొహాలూ కడిగించి తనూ కాల కృత్యాలు ముగించుకునేసరికి సూర్యోదయమయింది.

బాదం చెట్టుమీద కాకి రెక్కలు రెపరెప లాడిస్తోంది. పచ్చమట్టి, పేడతో అలికిన నేలమీద కొమ్మల్లోంచి తప్పించుకుని దూసుకొచ్చిన సూర్యకిరణాలు మెరుగు ముద్దర్లు వేస్తున్నాయి. రాత్రి రాలిన బాదంకాయలకోసం పిల్లలిద్దరూ కీచులాడుకుంటున్నారు. ఇద్దరికీ కాయలు సమంగా పంచిపెట్టి, పది రోజుల క్రితం వేసిన తోటకూర మడివంక చూసింది శారద. ఎండ చాలక, మారాకు వెయ్యక గిడసబారిపోయింది మడి. నిట్టూర్చింది శారద. తన బ్రతుకులానే అవి మోడు వారిపోయాయి.

ఎప్పుడు లేచిందో మూడో పిల్ల గీత తప్పటడుగులు వేస్తూ తల్లిదగ్గరకి చేరింది. అక్కయ్యలిద్దరి దగ్గరా బాదం కాయలు చూసి మాటలు రాకపోయినా కాయలు చూపిస్తూ గునవటం ప్రారంభించింది. దాని అభినయానికి నవ్వుకుంటూ చంకనెత్తుకుని పెద్దపిల్లలిద్దరి దగ్గరా చెరి రెండు కాయలూ తీసుకుని దాని చేతుల్లో పెట్టింది.

'అమ్మగారూ—పెరుగు' వెంకాయమ్మ వాకిట్లోంచి కేకవేసింది.

చటుక్కున చంకనున్న గీతని కిందకు దింపి 'మరిచేనేవ్-కాముడా! చూడమ్మా, మిషను బల్లమీద జాకెట్టు జాగ్రత్తగా తీసికెళ్ళి, మాణిక్యం పిన్నిగారికిచ్చేసి, మా అమ్మ రెండు రూపాయలు ఇమ్మన్నదని తీసుకు రా. తొందరగా రావాలిసుమీ! ఇక్కడ వెంకాయమ్మ గొడవ చేస్తుంది.' అంటూ పెద్దపిల్ల కామేశ్వరికి చెప్పి పంపి గిన్నె తీసుకుని తనూ వాకిట్లోకి వచ్చింది.

ఎదురుగా రిక్షా దిగుతూ భాగ్యం పెనిమిటి భానుమూర్తి కనుపించాడు. బావగారు కంటపడగానే గుండెలు జారి పోయాయి శారదకి. వెంకాయమ్మ తనని



చూస్తూనే దండకం ప్రారంభిస్తుందే, ఆయన ఎదురుగనే! భగవాన్ ఇప్పుడేది దారి?

అనుకున్నట్టుగానే మొదలు పెట్టింది పెరుగమ్మ. 'ఏందమ్మా గిన్నె మాత్తర పట్టుకొచ్చావ్ సామ్మేది?' అంటూ తన కంచుగొంతు గట్టిగా మోగించబోయింది. భయపడుతూనే ధైర్యంచేసి 'ఎందుకలా అరుస్తావ్ వెంకాయమ్మా! క్షణమాగు. నీ డబ్బు నీకిచ్చేస్తాను' అని గద్దించి అటు తిరిగి, వెలావెలా పోతున్న మొహానికి చిరునవ్వు పులుముకుంటూ బావగారిని పలకరించింది,

'రండి బావా' అంటూ.

తన ప్రతాపానికి ఎదురన్నది ఎరగని వెంకాయమ్మ ఈ హఠాత్ పరిణామానికి విస్తుపోతూ మళ్ళీ విజృంభించ బోయింది గాని, కొత్త మనిషిని చూచి తమాయించుకుని గొణుక్కుంటూ వుండిపోయింది

భానుమూర్తి లోపలికి వెళ్ళాడు తనని చూసి తలుపు చాటున నక్కి వింతగా తొంగి తొంగి చూస్తున్న గీతని దగ్గరకు తీసుకుని చెక్కిలిమీద ముద్దులు పెడుతూ గదిని పరికిస్తూ వుండిపోయాడు. పేదరికానికి దాఖలాగా వుందా గది

కామేశ్వరి చేతిలోని రెండు రూపాయలూ వూడబెరుక్కున్న వెంకాయమ్మని రహస్యంగా బతిమలాడుతోంది శారద. 'ఒక్క రూపాయి జమ వేసుకో వెంకాయమ్మా బంధువు లొచ్చారు చూస్తున్నావుగా! నా పరువు నిలబెట్టు. చేతి పైసా లేదు. త్వరలోనే నీ బాకీ మొత్తం ఇచ్చేస్తాముగా!' అంటోంది.

'సాల్లేవమ్మోయ్. బాకీ ఐదు రూపాయలుంటే రెండు రూపాయలిచ్చినావేందని నేనడుగుదామనుకుంటే, పైపెచ్చు ..' పెరుగో, మజ్జిగో తెలియని కుండలోని జావలాంటి పెరుగుని ఒక్కసారి గరిటతో గిర్రున తిప్పి కొలిచి గిన్నెలో పోస్తూ ఈసడించింది పెరుగమ్మ.

ఇంకేదో చెప్పబోయిన శారద మాటలు వినిపించుకోకుండానే తట్ట ఒడుపుగా నెత్తి మీద కుదురు పెట్టుకొని, 'ఇది రూపాయ లియ్యేల చీటీ గట్టాల! నా సోదె నెవరికి చెప్పుకోను?' అంటూ విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయింది వెంకాయమ్మ.

# అబల

వుసూరు మన్నది శారద ప్రాణం. బావకి కాఫీ ఎలా? ఫలహారం లేకపోతే పోనీ. దేవుడా ఎలాటి సమస్య...!

చెంబుతో నీళ్ళూ, తువ్వాలూ అందిస్తున్న శారదని, 'ఎలా వున్నావమ్మా?' అంటూ ఆప్యాయంగా పలకరించాడు భానుమూర్తి, గీతని దింపి చెంబందుకుంటూ.

'ఇలా వున్నాను బావా' తలవంచుకున్నది శారద.

మరదలి దైన్యస్థితికి కదిలిపోయాడు భానుమూర్తి. కళకళ లాడుతూ పచ్చగా పూచిన తంగేడులా వుండే శారద శుష్కించి పోయింది. 'ఎంత మారి పోయింది?' అనుకుని జాలిపడ్డాడు

ఆ ఎందుకొమ్మా, ఈ ఎందుకొమ్మా జేర్చి దొడ్లో పొయ్యిలో మంటబెట్టి, బావగారి స్నానానికి నీళ్ళు ఏర్పాటు చేస్తూ మథన పడుతోంది శారద. ఆయనకిప్పుడు కాఫీకి, భోజనానికి ఎట్లాగా? అని.

నీళ్ళతోడి కాకరపాదు వారగా పెట్టి పీట వేసింది. సబ్బు లేదు కొంచెం సున్నిపిండి వో పళ్ళెంలో వేసి పెట్టిందక్కడ.

భానుమూర్తి స్నానం చేస్తుంటే, కామేశ్వరికి మరచెంబిచ్చి, 'కాంతమ్మగారికిది ఇచ్చి రెండురూపాయలడిగి పట్టమ్మ'ని చాటుగా చెప్పి పంపింది. మధ్యాహ్నం తాను వస్తానని గూడా చెప్పమన్నది.

ఐదు నిమిషాలతో కామేశ్వరి పరిగెత్తుకుంటూ వచ్చింది మరచెంబుతో సహా. అప్పటికి భానుమూర్తి స్నానం ముగించుకుని రాబోతున్నాడు. కల్లా కపటం తెలీని కామేశ్వరికి తల్లి చేస్తున్న సైగలు అర్థం కాలేదు. 'కాంతమ్మత్తయ్యగారి దగ్గర రూపాయలు లేవటమ్మా, మరో చోట ఇప్పిస్తానన్నది. బేడచెప్పనట. నిన్ను అడిగి రమ్మన్నది,' గట్టిగా చెప్పేసింది రొప్పుతూ

'బావగారు విన లేదు కదా' అని ఆందోళన పడుతూ తలెత్తిన శారదకి, తనవంకే చూస్తూ గుమ్మంలో నించున్న భానుమూర్తి అగుపించాడు. తప్పుచేస్తూ దొరికిపోయిన దానిలా తలతిప్పేసుకుని ఏదో పని వెతుక్కోసాగింది శారద.

మరదలి అభిమానాన్ని అర్థం చేసుకున్న భానుమూర్తి మరి అక్కడ నిలబడకుండా వెళ్ళి బట్టలు వేసుకుంటూ ఆమెరా అవస్థనించి తప్పించాడు.

ఏం తిప్పలు పడ్డదో దేవుడికెరుక. అరగంటలో రెండు ఇడ్లీలు, ఇత్తడి గ్లాసుతో కాఫీ, తెచ్చి పిల్లలతో కబుర్లు చెబుతూ చాప మీద కూర్చున్న భానుమూర్తి దగ్గరసా పెట్టింది. 'తీసుకోండి బావా' అంటూ.

మారు మాటాడకుండా కాఫీ, టిఫినూ ముగించాడు భానుమూర్తి. పళ్ళెం తీసుకుపోవచ్చిన శారదతో, 'చూడమ్మా నా గురించి వేరే ప్రయత్నమేమి చెయ్యద్దు. నా కిప్పుడు బస్సువున్నది. అర్జంటుగా వెళ్ళాలి' అన్నాడు నింపాదిగా

'అదేమిటి బావా. భోంచేసి వెళ్ళండి' అన్నది. ఆ మాటలో పట్టుదల లేదు.

'అలాక్కాదు లేమ్మా పెదపాడు పొలం పనిమీద వెడుతూ చూచిపోదామని దిగాను ఇక్కడే దిగబడిపోతే అక్కడ పని ఆగిపోతుంది మరోసారి వస్తా లేమ్మా' అంటూ లేచి నించున్నాడు.

బలవంతం చెయ్యలేదు శారద. తన దౌర్భాగ్యస్థితి అతను గ్రహించుకున్నాడలే వుంది. ఎలా వుండగలడు? అనుకుంది లోపల. ఇంటికొచ్చిన బంధువుకి పట్టెడు మెతుకులు పెట్టలేక పోయానే, అన్న వేదన ఆమెను కృంగదీస్తోంది.

భానుమూర్తి వెళ్ళిపోయాడు. మరి కొంత సేపటికి కామేశ్వరి కేక వేసింది 'అమ్మా పెదనాన్న సంచి మరిచేపోయ్యాడేవ్' అంటూ.

భానుమూర్తి చేతిసంచి చూస్తూ 'అయ్యో ఇప్పుడెలాగ' అనుకున్నది శారద.

మరో అరగంట లోపలే తిరిగి వచ్చిన భానుమూర్తిని చూసి, సంచీకోసమే అనుకున్నది శారద. కాని అతని వెనకే రిక్షా మీదనించి దిగుతున్న సామగ్రిని చూసి ఆశ్చర్యపోయింది. మరి అతను బస్సెందుకు వెళ్ళలేదన్నమాట.

భానుమూర్తి సంజాయిషీ చెప్పుకున్నాడు.

'నే నెందుకు వెళ్ళిందీ తెలిస్తే, నీవు

అభ్యంతరం పెడతావని ఇలా చేశాను శారదా! తండ్రి తరవాత తండ్రంతటి వాడిని నా దగ్గరనే మొహమాటపడి నీ పరిస్థితిని చాటుచేస్తున్నావంటే నాకెంతో బాధగా వుంది. ఇదే మీ అక్కయ్యయితే నువ్విలా చేయగలుగుదువా? నువ్వెంతో అభిమానవతి వని నాకు తెలుసును. కాని నేనూ పరాయివాణ్ణి కాదమ్మా' అంటున్నప్పుడు అతని గొంతూ, మనసూకూడా ఆర్ద్రమయ్యాయి.

శారద కళ్ళు చెమర్చినాయి. మాటలు గొంతు పెగిలి రా లేదు. అమలిన మైన అతని సానుభూతికి లజ్జతో క్రుంగిపోయింది.

ఆ స్థితిలో ఎంతసేపలా వుండిపోయిందో గాని, తెచ్చిన సామానంతా రిక్షావాడి సాయంతో ఇంట్లోకి జేర్చిన భానుమూర్తి హెచ్చరించటంతో తెప్పరిల్లుకున్నది.

గీత చేతిలో రెండు పదిరూపాయల నోట్లు మడిచి పెడుతూ, 'మరి నేను వెళ్ళి వస్తానమ్మా. ఇకమీద ఎప్పుడు అవసరమైనా నాసింటి సహాయం తీసుకోటానికి జంకవద్దు సుమా!' అంటూ సంచి చేతులోకి తీసుకున్నాడు భానుమూర్తి.

మెల్లిగా తల వూపింది శారద.

కమ మరుగవుతున్న బావగారిని కృతజ్ఞతగా చూస్తూ 'ఆయన' అపుదార్యాన్నే తలుచుకుంటూ నిలబడిపోయింది శారద.

పరిచివున్న బిస్కట్ల పొట్లాలమీద దండయాత్రచేసి కుస్తీలు పడుతున్న పిల్లల్ని సద్దుతూ భానుమూర్తి తెచ్చిన సామానుకేసి దృష్టి సారించింది. బియ్యం, పప్పు వుప్పుతో సహా ఇంటికి కావాలిసిన సరుకులన్నీ నెలకు సరిపడా వున్నాయి.

మరునటి నెలకూడా భానుమూర్తి ఏభై రూపాయలు శారదకు మనియార్డరు చేశాడు. కుట్టు మిషన్‌మీద ఏదో నాలుగు రాళ్ళు వస్తున్నాయి. దానా దీనా వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా ఏదో 'గుడ్డిలో మెల్ల'గా సంసారం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాఫీగ సాగిపోతూంది.

* * *

ఉన్నట్టుండి మబ్బులేని పిడుగులా వూడిపడ్డ అక్కగార్ని చూచి ఆశ్చర్యపడింది శారద.

'ఇదేనా అక్కా రావటం?' చిరునవ్వుతో పలకరించింది.

'ఆ, ఇదే' అన్నది భాగ్యమ్మ దూకుడుగా.

'ముందు ఉత్తరం ముక్కయినా రాయకుండా ఇలా వూడిపడ్డావేం?' అంది నవ్వుతూ.

'ఏం ముందు తెలుసుంటే మాటలు ఏరుకుని సిద్ధంగా వుండేదానివా?' చెల్లెలి కళ్ళలోకి చురుగ్గా చూస్తూ వ్యంగ్యంగా ఒక విసురు విసిరింది భాగ్యం.

'మాటలేమిటి? ఏరుకోవట మేమిటి?' తెల్లబోయింది శారద.

'సంగనాచి తుంగబుర్రవి నీకేం తెలుసు పాపం? కడుపులో ఎప్పటి కావేషమో పెట్టుకుని నన్నిలా సాధిద్దామనుకుంటున్నావా?' అంటూనే కోపంలోంచి ఏడుపులోకి జారిపోయి, 'ఏమో ఏ కాస్త వయసయిన వాడైనా ఆరోగ్యంగానే వున్నాడుగదా అని, ఆ జీతండబ్బులు తప్ప మరేమి రాబడిలేని ఆ మొహన్ని పెళ్ళాడేకంటే, పెద్దాస్తి వున్నవాడు కనాతయనతో ఎక్కువ సుఖపడగలవనే వుద్దేశ్యంతోనూ నిన్ను బలవంతపెట్టినే కాని, నీ బతుకిలా అధ్వాన్నమవుతుందని నేను ముందుకు కలగన్నానా?' అంటూ కళ్ళు వత్తుకుంది భాగ్యమ్మ.

'జరిగిపోయినవన్నీ ఇప్పుడెందుకక్కా' వుదాసీనంగా అన్నది శారద వింటా చూస్తూ.

మళ్ళీ రెచ్చిపోయింది భాగ్యమ్మ.

'ఇప్పుడెందుకని అడుగుతున్నావా? మరి ఆ కుచ్చితంతో కదూ ఇప్పుడు నా సంసారంలో నిప్పులు చెరుగుతున్నావ్? నీ బతుకు బుగ్గి అయినందుకు నామీద కక్ష తీర్చుకుంటున్నావా?' కళ్ళల్లో నిప్పులు కక్కుతూ దూసింది భాగ్యమ్మ.

'ఏమిటక్కా నువ్వనేది?'

'ఏమిటా? నీకందకుండా పోయిన రాజభోగాలు నా మొగుణ్ణి ముగ్గులోకి దింపి తీర్చుకుంటున్నావు. తోడబుట్టిన దానివి పెనిమిటన్నా సిగ్గూ సెరమూ లేకుండా నా కాపురం కూలదొయ్యాలని ఎత్తులు వేస్తున్నావా?'


'అక్కా' అని నిర్ఘాంత పోయింది శారద. ఎంతటి అపనింద? కొంతసేపటిదాకా మాట రాక అట్లాగే అక్కవంక రెప్పవాల్చకుండా చూస్తూ వుండిపోయింది.

ఆడదానికి ఆడదే శత్రువా!

ఆ సమాసంలో నీరసమొచ్చినట్టయి నేలమీదే కూలబడిపోయింది భాగ్యం.

నాలిక తడి చేసుకుంటూ, 'దేన్నిబట్టి నామీద ఇంత అపనిందం వేస్తున్నావక్కా' అన్నది రుద్ధకంఠంతో శారద.

'ఏం? నెలకు మూడుసార్లు నీచుట్టూ ప్రదక్షిణం చెయ్యటంలా ఆయన? నెలనెలా మనియార్డరుతో దక్షిణ ముట్టచెప్ప




'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి,' ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం||


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327 TEL

మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు
1.తెల్సుకోదగ్గవి:- మీ జీవితసుఖసంతోషాలకు మీరు తెలుసుకోదగ్గ అనేక వందల అద్భుత విషయాలు. రూ 5-00
2.అద్భుతహాస్యకథలు:- మీరు నవ్వటానికి యితరులను బాగా నవ్వించటానికి కొన్ని వందల నవ్వించే కథలు. రూ. 3-50.
3.చేతిపనులు:- చిన్నపరిశ్రమలకు సర్కారికి సంపాదనకు ఎన్నో రకాల సరుకులు, సులభంగా చేసుకోనే విధానాలు రూ.3-50.
4.మంత్రశక్తి:- మీ కోర్కెలు నెరవేర్చుకోవటానికి వివిధమంత్రాలు వాటి అద్భుత రహస్యాలు సాధనమార్గాలు. రూ 3-50.
5.జీవితరహస్యాలు:- మీ దాంపత్యజీవితాన్ని సంపూర్ణఆనందమయం చేసుకోవటానికి అనేక దివ్యకామసూత్రాలు రూ.3-50
6.యువతి:- స్త్రీలనుగురించి యువతీయువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహలవిషయాలు రూ.3-50.
7.సంతానము:- కామసుఖాలు అనుభవించుచు కూడ అవసరం లేనపుడు గర్భంరాకుండా 60 సులభమార్గాలు రూ 3-50.
కీర్తిరచన ఎ.యస్.మూర్తి, యం.ఏ. పోస్టు ఖర్చులు అదనం.
దేశసేవ ప్రచురణలు, ఏలూరు.2., ఆంధ్రకు వ్రాసి మీకావలసినవి వి.పి. పోస్టుద్వారా పంపబడును.

ఇండియాలో మొదటి దఫా
E-70 స్టాండర్డ్ రూ. 100/-ల్లో


3 బ్యాండ్, ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ (2 ఏండ్లు గ్యారంటీ) కొద్ది స్టాకే గలదు.
వ్రాయండి లేక కలుసుకోండి.
EVERY ELECTRONICS INDUSTRIES,
922, Kucha Rohilla Khan,
Darya Ganj, Delhi—6.


# అబల

టంలో అంతమాత్రం గ్రహించుకోలేని వెర్రి బాగుల్దాన్ననుకుంటున్నావా?' మింగేసేలా చెల్లెలివంక చూసింది భాగ్యమ్మ.

'నువ్వు చాలా పొరబాటుపడుతున్నావక్కా! పెదపాడులో మీ పొలాలు చూడ్డానికి వెడుతూ బావ ఒకటిరెండుసార్లు ఇక్కడ దిగిన మాట వాస్తవమే. కాని నీవు వూహించే నీచమైన సంబంధం మా మధ్య లేదు. కూటికి గుడ్డకి కరువై కటకటలాడుతున్న మమ్మల్ని చూసి జాలిపడి, నేను వద్దంటున్నా వినక, ఆయనేదో పంపిస్తున్న మాటా నిజమే. ఇష్టం లేకపోయినా పిల్లల మొహాలు చూసి మీ సహాయం అందుకోక తప్పడం లేదు నాకు. కాని ఇదంతా నీ ఇష్టంమీదే జరుగుతూందనుకోవటమొకటే నే చేసిన పొరబాటు. ఐదువందలకోసం మొహం చూసుకుని నువ్వు యింతే నన్నొగోతిలోకి దింపగలిగావుగాని, అది మనసులో వుంచుకుని, నిన్ను ఇంత నీచంగా వంచన చేసేటంత ద్రోహబుద్ధి నాలో లేదక్కా. ఇన్నాళ్లు కాపురంచేసి బావ ఔదార్యాన్ని ఇంత మకిలిగా ఊహిస్తున్నావంటే ఆడజన్మే ఇంత గావును అనిపిస్తోంది' అని విదిల్చి కొట్టింది శారద. ఎంత సంబాళించుకున్నా ఆవేశం పట్టలేకపోయింది.

తగలాల్సిన చోటనే తగిలాయా మాటలు భాగ్యమ్మకు. మొహం మాడిపోయింది. దెబ్బతిన్నట్టు గిలగిల్లాడిపోయింది.

'ఐదువందలకోసం మొహం చూసుకుని నిన్ని గోతిలోకి దింపానా!' ఉక్రోషంతో అలానే గోడకి జారబడిపోయింది భాగ్యమ్మ.

ఆ సందర్భమిదీ—

మోహన్ శారద మేనత్తకొడుకు... వీరికంటే పేదరికంలో ఓ మెట్టు దిగువనే వున్నవాడేను. ఎలాగయితేనేం వారాలు చేసుకుని బి. ఎ. ప్యాసయ్యాడు.

అప్పటిదాకా అతని బాగోగుల్లో ఏమాత్రమూ జోక్యం కలిగించుకోలేకపోయినా, అతను బి. ఎ. ప్యాసయ్యాడనగానే, మేనరికపు సాకు చూసుకుని, శారదను చేసుకోమ్మని అడగబోయాడు శారద తండ్రి రంగయ్యగారు. అప్పట్లో శారద పెద్దదై ఐదారేళ్లయి; ఆయనకో తీరని సమస్య అయి కూచుంది.

కాని అప్పుడు మోహన్ ఓ విషమ సమస్యలో ఇరుక్కుని వున్నాడు. తాను వారాలు చేసుకుంటున్న ఆఫీసరుగారి రికమండేషన్‌తో చేసిన ప్రయత్నంలో వుద్యోగం దొరికే సూచన కనబడింది అతనికి. కాని ఒక బకాసురుడికి తప్పనిసరిగా వో వెయ్యిరూపాయలు ముడుపు చెల్లిస్తేనేగాని అది సాధ్యం కాదని తేలిపోయింది.

వారాలబ్బాయి దగ్గర వెయ్యిరూపాయలెక్కడివి?

సరిగ్గా అదే సమయంలో దిగబడ్డారు రంగయ్యగారు. మేనమామ స్థితిగతులు తెలిసినవాడే అయినా, ఆయన్ని నిరాశ పరచక తప్పలేదు మోహన్‌కి.

'మామయ్యా శారదను చేసుకోడానికి నాకేం అభ్యంతరం లేదుగాని, 'తాదూర సందులేదు — మెడకో డోలని' నాకేతిండి లేనిది దానికేమి పెట్టను. ఆ వెయ్యి రూపాయలతో నాకా ఉద్యోగం కొని పెట్టినవాడు, శారదనే కాదు ఎవర్ని చేసుకోమన్నా నేను సిద్ధమే' అని ఖరాఖండిగా చెప్పాడు.

అవును మరి. మేనరికంకంటే ముందు కడుపు తిప్పలే ముఖ్యం కదా!

ఉసూరుమంటూ ఇంటికి తిరిగి వచ్చినా, ఆశ చావలేదు రంగయ్యగారికి.

పెద్దకూతురు భాగ్యానిది కలిగిన సంసారం. రంగయ్య ఏ కాస్తో బాగా వున్న పరిస్థితుల్లో ఆయన చేసిన మంచి నిర్వాకమదే.

బంగారుబొమ్మలాంటి భాగ్యాన్ని చూసి మనసు పడ్డాడు భానుమూర్తి. తను అంతస్తుకి తగని సంబంధమని తల్లిదండ్రులు గోలపెడుతున్నా వినక పట్టుబట్టాడు.

చేసేదిలేక, తమ తాహతుకు తగ్గట్టు హుందాగా శుభకార్యం నెరవేర్చాలన్న షరతుమీద ఒప్పుకున్నారు చివరికి.

అంత గొప్పవారితో వియ్యమందటమే ఒక అదృష్టమని మురిసిపోయారు రంగయ్యగారు. కాని కట్నకానుకల భారం లేకపోయినా వారితో సరికి సరిగా తూగేసరికి అప్పులపాలయ్యాడు కూడా.

— అత్తమామలు బ్రతికున్నంతకాలం

వాళ్ల ఈసడింపులతో కొన్నాళ్ళు తిప్పలు పడ్డా వారి అనంతరం పెత్తనం చేజిక్కించుకుని మహారాణిలా అధారిటీ చెలాయిస్తోందీనాడు భాగ్యం.

అప్పటిదాకా, తానింత సంపదలో వుండీ, తలితండ్రులికి సాయం చెయ్యలేక పోతున్నానే అని చింతిస్తూండేదల్లా, తన చేతికి అడ్డం లేక పోయేసరికి, వాళ్లది నిష్ట దరిద్రమంటూనూ, ఎంత పెట్టినా తరిగేది కాదనీ, నిరసనగా చూడ్డం మొదలుపెట్టింది. కాని భానుమూర్తి అలా కాదు. ఈనాడు వున్నా లేకపోయినా పస్తులుండకుండా రంగయ్యవాళ్లా కలో గంజో తాగుతున్నారంటే అతని సాను భూతి, దయారసమే కారణం.

మోహన్ దగ్గర్నుంచీ తల ఒంచుకుని రంగయ్యగారు సరాసరి పెద్ద కూతురు దగ్గరకు వెళ్లారు.

అల్లుడి చేతులు పట్టుకున్నారు.

'బాబూ ఈ వెయ్యి రూపాయలతో నాకు సగభాగం తగ్గించిన వాడవుతావు. నా బిడ్డ దీపం పెట్టి నీ పేరు తలుచుకుంటుంది.' అంటూ కళ్లనీళ్ల పర్యంతమై బ్రతిమలాడుకున్నాడు.

మామగారి దీనస్థితికి సహజంగానే దయాళువైన భానుమూర్తి వెన్నలా కరిగిపోయాడు.

ఆ సమయంలో కాదనటానికి భాగ్యానికీ మనస్కరించలేదు.

నాలుగు రోజుల్లో డబ్బు తీసుకుని పుట్టింటికి వచ్చింది భాగ్యమ్మ.

అదే సమయంలో శారదని చూడ్డానికి వచ్చి, మేనరికముందని తెలిసి వెనక్కి తగ్గిన పరంధామయ్యగారు ఆమెకి తటస్థపడ్డారు. చటుక్కున భాగ్యం మెదట్లో ఒక పాపిష్టి ఆలోచన మెదిలింది.

శారదకన్న రెండేళ్లు చిన్నది కమల. దాన్ని ఇస్తేనో పరంధామయ్యగారికి? నయాపైస కట్నమక్కరలేదు తన ఉపాయం తల్లి చెవిలో వూదింది.

'అబ్బే అది అసలే నాదారిది. అతని పక్కన మరీ మనవరాల్లా వుంటుందే' అంటూ వప్పరించేసింది తల్లి ఇష్టంలే.

'పోని శారదనే చేసుకొమ్మంటే సరి! చెట్టంత ఎదిగింది, — ఈడూ జోడూ మరీ ఎబ్బెట్టుగా వెరవురెడదు. రాయల్లె వున్నాడు మనిషి. కాళ్ల దగ్గరకొచ్చిన సంబంధం కాదనటమెందుకు? శారదకు ఈ సంబంధం ఖాయం చేసుకుంటే ఇక మోహన్‌కి మన కమలను ఇచ్చెయ్యవచ్చు. అదిమాత్రం పెద్దమనిషై మూడేళ్లు కాలా? ఒకేసారి రెండు పెళ్లిళ్లూ కలిపి చేస్తేసరా ఖర్చులుకూడా కలిసొస్తాయి. చూడు మరి!' అని నచ్చచెప్పింది తల్లికి. బరువు భారాలు తీరే ఆలోచన ఏదయితే నేంగాక. సరేనన్నదామె.

అప్పటిదాకా కూతురు వెయ్యి రూపాయలు ఇవ్వాలిసొస్తూందని ఇలా పక్కదార్లు వెతుకుతూందని అనుమానించిన తల్లి, ఇప్పుడు ఇద్దరి కూతుళ్ల పెళ్లి భారమూ తొలుగుతుందనే సరికి కొంత మెత్తబడింది. తమ మేలుకోసమే భాగ్యం అంత తాపత్రయ పడుతున్నదని నమ్మిందామె.

'నివన్నదీ నిజమే! నిపుణ్యమూ అని ఆ ఇద్దరి మెడల్లోనూ, పసుపుతాళ్లు పడ్డాయంటే అంతే మేము గట్టున పడ్డట్టే. ఇహ సీత కిప్పుడప్పుడే తొందర లేదు. గదా! మీ నాన్న నిలా పిలువు చెబుదాము' అని తన అంగీకారం తెలియజేసింది.

ఒక్కకూతురు పెళ్లితోనే అణగారి పోయిన ఆ మానవుడు, మరో ఇద్దరి భారం అలాగ్గా ఒక్క దిగిని ఒదిలి పోతున్నాదంటే ఒప్పుకోక ఏం చేస్తాడు?


తన ప్రమేయమేమీ లేకుండానే జరిగి పోతున్న ఈ కర్మకాండ యావత్తూ చూస్తూ తను అల్లుకున్న తియ్యని స్వప్నాలను తనలోనే అణిచేసుకున్నది శారద.

అలా శారద, కమలల పెళ్లిళ్లు రెండూ భాగ్యం అజమాయిషీలో జరిగి పోయాయి. చూచిన వాళ్లంతా భాగ్యం చూపిన ఆత్మీయతనీ, ఆప్యాయతనీ అగ్గించి చెప్పుకున్నారు.

కాని భాగ్యం చాకచక్యంగా పరంధామయ్యగారితో ముందే కమలపెళ్లికి మాతోపాటు మీరూ సాయం చెయ్యాలంటూ ఐదువందల రూపాయలూ పుచ్చుకోవటమూ పెళ్లిఖర్చులు కూడా మూడు వంతులు ఆయనచేతనే పెట్టించడమూ రంగయ్యగారికి దరిమిలా తెలిసినా, కన్యాశుల్కం వసూలు చేసినట్టు అనిపించి మనసు చివుక్కుమన్నా, 'డబ్బు పాపిష్టిది' అని సరిపెట్టుకున్నారు.

*　　　*　　　*

నాటి సంఘటనే నేడు తిరగతోడింది శారద. ఆ సంగతి తననేగాక శారదని తొలుస్తూనే వున్నదన్నమాట ఇన్నాళ్లూ. గతం తవ్వగానే బాకుతో పొడిచినట్టు ప్రమాన్పడి పోయింది భాగ్యం. అందులో తన అయిదువందలు కక్కుర్తి వున్నదాయెను.



అక్కడ మోహాన్ని చేసుకున్న కమల తనని తలుచుకుని దీపం పెట్టుకుంటూంటే ఇక్కడ శారద తనని శపిస్తోంది. ఎంత తేడా!

*   *   *

భాగ్యం వచ్చి వెళ్ళాక మనస్సు వ్యాకుల పడిపోయి చానాళ్ళకిగాని తేరుకోలేక పోయింది శారద. దానికితోడు సంసార పరిస్థితులు లామెను మరి కాస్త క్రుంగ దీస్తున్నాయి.

భానుమూర్తి నెల నెలా కొంత పంపుతున్నందువల్ల, ఈ మధ్యలో తిండి కాస్త పసిగా తింటానికి అలవాటు పడ్డారేమో మళ్ళీ అది అది వెనకబట్టేసరికి, యధాస్తితికి సద్దుకుని సరిపెట్టుకోవడంలో అందరూ విలవిల్లాడి పోనారు.

ఈ సారి భాగ్యమే చెల్లెలికి డబ్బు పంపిందికాని అంతరాద్వాతం జరిగిన తరవాత ఆ డబ్బు తీసుకుందుకు ప్రాణం చచ్చిపోయింది శారదకి. వచ్చిన మనియార్డరు వచ్చినట్టే వెనక్కి వెళ్ళింది.

అన్నం కలిపిన కంచాన్ని అవతలికి తోసేస్తూ, 'వుహు నాకు వద్దు—దోసే కావాలి' పేచీ పెడుతూ కాళ్ళు రెండూ తప తపా నేలకేసి కొట్టుకుంటూ రాగం తీస్తోంది రెండోపిల్ల జానకి.

అరగంటనించీ ఆ పిల్లకి సర్ది చెప్పలేక నానా హైరానా పడుతున్నది శారద.

అమ్మ ఇదివరకటిలాగే ఇంచక్కా

# అబల

వుప్మావో, దోశా ఏదో ఒకటి చేసిపెడితే తినొచ్చనే జిహ్వా చాపల్యం తప్ప ఆ బుల్లి బుర్రలో ఆర్థిక సమస్యలేమి దూరతాయి?

ఎంతసేపు బుజ్జగించినా లొంగక మంకుపట్టు పట్టిన కూతురు మొండితనానికి విసిగిపోయింది శారద. జానకి తోసిన తోపుకి అన్నపుపళ్ళెం ఆమడ దూరాన పడి కలిపిన అన్నమంతా నేలపాలయ్యేసరికి ఆమె సహనం అడుగంటింది.

'అమ్మా బాబూ అన్నంతసేపూ నువ్వు వింటావా?' అంటూ జానకి చెంపలు రెండూ వాయించింది.

దానితో ఇంటికప్పు ఎగర గొట్టేసింది జానకి.

వెదజల్లిన మెతుకులన్నీ ఎత్తి, శుభ్రం చేసుకుని ఇవతలికొచ్చే వేళకు జానకి ఇంకా వెక్కుతూనే వున్నది.

మరి ఇక ఈ పూటకు దానికి కూడు లేదు. శారదలో తల్లిప్రాణం తల్లడిల్లి పోయింది. పైగా ఆ కందిపోయిన బుగ్గలు చూస్తుంటే పశ్చాత్తాపం దహించివేసింది శారదని. తన సాధక బాధకాలు పసిపిల్ల దానికేమి తెలుస్తాయి?

రెండోపూట బియ్యానికని పదిలంగా దాచిపెట్టిన డబ్బుల్లోంచి పావలా తీసి జానకి చేతిలో పెట్టి కామేశ్వరిని తోడిచ్చి హోటల్‌కి పంపించింది.

కొట్టిన దెబ్బలన్నీ ఎక్కడకు పోయాయో, చిలకలా అక్కవెంట నడిచి వెళ్ళింది జానకి.

పావుగంటలో ఒడినిండా పాకెట్లతో తిరిగివచ్చారు పిల్లలిద్దరూ.

'ఇన్నెక్కడివి?' అనుమానంగా నుదురు చిట్లించింది శారద.

'బాబయ్యగారు ఇప్పించారు. రోజూ గూడా ఇప్పిస్తానన్నారు.' సంబరంగా గంతులేస్తూ చేతులు తిప్పింది జానకి.

'ఏ బాబాయ్?' తెల్లబోతూ గదిమింది శారద.

తల్లి కేకకి అదురుకుని గంతులు ఆపింది జానకి. కొద్దిగా వూహ తెలిసిన పిల్ల కామేశ్వరి. తల్లి కళ్ళు పెద్దవి చేసి గదమాయిస్తుంటే చూస్తూ తామేదో పెద్ద తప్పే చేసి వుంటా మనుకున్నది. జడుస్తూ జడుస్తూ ఏదో చెప్పబోయింది.


'నేనే లెండి. పిల్లలనేమి అనబోకండి' పక్కింటాయన గడపలో నించొని వంకర నవ్వులు ఒలకపోస్తున్నాడు.

ఒక్కసారి ఆయనవంక చిరాగ్గా చూచి తల తిప్పేసుకుని పిల్లల నిద్దరినీ బరబరా పెరట్లోకి లాక్కుపోయింది.

అక్కడ వాళ్ళకి వేస్తున్న శిక్ష ఏమిటో వాళ్ళ ఏడుపులూ పెడబొబ్బల్ని బట్టి ఇట్టే తెలిసిపోయిందాయనకి. చేసేది లేక చల్లగా జారుకున్నాడు అక్కణ్ణించి.

రాత్రికి పొయ్యిలో పిల్లి లేవలేదు. ప్రొద్దున్న పిల్లలు తెచ్చిన పొట్లాలు వాకిట్లో తచ్చాడుతున్న కుక్క కాస్త కైంకర్యం చేసింది. వంటినిండా కమిలిపోయిన కర్రదెబ్బలతో సొమ్మసిల్లి కలత నిద్ర పోతున్నారు పిల్లలు. మూడు పూటల నించీ సరిగ్గా తినీ తినకా నీరసంతో ఒళ్ళు తూలుతూంది శారదకి.

కడుపునిండా పట్టినన్ని నీళ్ళు తాగి వాకిలి తలుపు వెయ్యబోయింది. ఎదరింటి మేడ గదిలోని కాలేజీ విద్యార్థి కిటికీ లోంచి వెకిలిగా నవ్వుతూ చేతులూపుతున్నాడు. అసహ్యం వేసి భడాలున తలుపువేసి తల బద్దలయిపోతుంటే చాపమీద వాలిపోయింది. అప్పుడు



మెదిలింది గోపం—తన ఒంటిని యవ్వన మింకా దిగిజారలేదన్నమాట!

ఈ ఆకలి మంటకు తోడు, ఆ అలుసు తీసుకుని తనని ఏ పాపకూపంలోకో లాగ డానికని చుట్టూ పొంచున్నాయి గడుసు దెయ్యాలు. వీటిని ప్రతిఘటించడ మొక సమస్యే తనకి?

నిద్దరలో, 'కొట్టొద్దమ్మా' అని కలవరిస్తోంది కామేశ్వరి. జాలిగా అటు కేసి చూసింది. లేతబుగ్గలమీద కన్నీటి చారికలు చెరిగిపోలేదు. నిద్రలోకూడా ఆ అమాయకమైన ముఖబింబాలమీద, భయాందోళనలు తారాడుతున్నాయి. కడుపు తరుక్కుపోయింది శారదకి. తను వ్యర్థంగా పెంచుకుంటున్న కసినీ, చాతగాని తనాన్నీ, ఎదురు తిరగలేని పసిపిల్లల వంటిమీద తీర్చుకుంటోంది. కోపం దౌర్బల్యానికీ, అసమర్థతకీ చిహ్నం.

శారదలో ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. ఆకలి కడుపులో అరవై నాలుగు విన్యాసాలున్నాయట! ఎప్పుడో వింది తను.

భార్య పుట్టింటికి వెళ్ళిన దగ్గర్నించీ పక్కింటాయన చూపులు తనను వెన్నాడుతూనే వున్నాయి. ఆ మధ్య మరీ బరితెగించి, పిల్లలకంటూ పళ్ళూ, మిఠాయి పొట్లాలూ తెచ్చియిస్తూ, వాళ్ళని కాకమ్మ కబుర్లతో బెల్లిస్తూ, తనతో మాట కలపాలని ఉవ్విళ్ళూరి

# అబల

పోతున్నాడు భ్రష్టుడు.

ఇక ఆ కాలేజీ అబ్బాయి సరే సరి... తనకంటే చిన్నవాడేమో కూడా... అదేం బుద్ధోమరి! ఏకంగా ఉత్తరాలే పంపిస్తున్నాడు. తన నెత్తిమీద గొడుగులేదని తెలిసి ఇందరిలో ఇన్ని చెడు ఆలోచనలు చెలరేగుతున్నాయి.

తనకళ్ళల్లో లాలసగాని, తన రక్తంలో రసికత్వంగాని సంసార లంపటంలో ఏనాడో కాలి మసిగారిపోయినై. కాని తను శీలవతే నంటే నమ్మగలిగే వారెంతమంది?

తన ఇంటికే మగవాడొచ్చినా, ఎందుకొచ్చినా చుట్టుపక్కల వాళ్ళందరికళ్ళూ తన ఇంటిమీదే వుంటున్నాయి. గమనిస్తునే వుంది తను.

వేరే ఎవరి సంగతో ఎందుకూ? సొంత అక్కయ్యే తనని అనుమానించి అవమానించిందే!

పొరుగింటి మాణిక్యమ్మగా రంటుంది; ఎవరిమీదనో పెట్టి, 'ఏమోనమ్మా వయసులో వున్నవాళ్ళని ఏం నమ్మగలం? ఏ క్షణానికి బుద్ధి ఎలా మారుతుందో ఎవరు చెప్పగలరు?'

అవతలింటి సీతారత్నమ్మ సరే సరి. పెళ్ళికాని పెద్దమ్మాయిని తన ఇంటికి పంపేందుకే జంకుతోంది ఎక్కడ మైల పడుతుందోనని.

మొన్న మొన్న కుట్టుకూలి కాస్త కురదలా వుండిపోయి ఇస్తుందేమోనని సుభద్రమ్మ ఇంటికి వెళ్ళింది తను. డబ్బులు చేతిలో పెట్టి తను వెళ్ళిపోయే దాకా తరిమి తరిమి వదిలిపెట్టింది తనని. ఆవిడ పెనిమిటికి కాస్త చపల చిత్తం. ఆయన కన్ను తనమీద ఎక్కడ పడుతుందోనని ఏక గంగవెర్రులెత్తింది.

నిజానికి తననింత వరకూ వేలెత్తి చూపలేదెవరూ. కాని ఇన్ని చూసి కసుక్కున నవ్వడమూ, పిచికమీద బెట్టీ, పిల్లిమీద బెట్టీ మాటీ పోటీగా మాటలు విసరడమూ సాగిస్తున్నారు కొందరు. తప్పించుకు తిరుగుతోంది. నిలబడి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని ఎంతమంది అనుమానాలని నివృత్తి చెయ్యగలదు తను.

ఈ దారిద్ర్యం, ఈ మనస్తాపం ఎవరి కోరకని తను కిమ్మనకుండా భరించాలి. తానింత పవిత్రంగా వుండి సాధించిన దేమిటి? అనుమానాలూ — అపవాదులూ తప్ప! తన కళ్ళముందే తన పిల్లల్నెందుకు చేతులారా మాడ్చివెయ్యాలి?

నిజమే — వారి వూహలే నిజం కానీ!

తన బిడ్డలింక ఎవరినీ దేబిరించ నక్కరలేదు. తానింక ఎవరినీ లక్ష్య పెట్టదు.

ఆవేశంలో ఆలోచనలు పెడత్రోవ తొక్కాయి.


పిల్లలవంక ఒక్కసారి గాఢంగా చూసి మెల్లిగా దుప్పటికప్పి లేచి బయటకు వచ్చి గొళ్ళెం పెట్టింది శారద.

* * *

నారాయణమూర్తి నరసింహయ్యగారి పెద్దకొడుకు. అంటే శారదకు సవితి కొడుకు. ఇన్నాళ్ళూ వుద్యోగరీత్యా వూళ్ళుపట్టుకు తిరుగుతున్నాడు.

ఎదిగొచ్చిన కూతురుకు పెళ్లి సంబంధాలు చూసుకుందుకు వుద్యోగంలో తీరక సావకాశంగా నాకబుచేసి, మంచి సంబంధం చూసుకోవచ్చునే వుద్దేశ్యంతో నాలుగైదు నెలలు సెలవుపెట్టి తండ్రి ఇంటో తన వంతు కొచ్చిన వాటా ఖాళీ చేయించి వచ్చి చేరాడు.

వచ్చిన కొత్తలోనే నలుగురి దగ్గరా సవితితల్లి ప్రవర్తనమీద చూచాయగా



పుకార్లు కూడా విన్నాడు. అయినా, 'నాకెందుకు కొన్నాళ్ళుండి పోయేవాడిని' అనుకుని విని విననట్లూరుకుండి పోయాడు.

కాని పక్కింటావిడ పుట్టింటి దగ్గర్నించీ శారదను దుమ్మెత్తిపోస్తూ గుట్టుగావున్న వ్యవహారాన్ని పల్లెగా వీధికెక్కించింది.

పక్కనేవుంటూ కలగజేసుకోవాలో, కూడదో ఇదమిద్ధంగా తేల్చుకోలేక సతమతమవుతుండగా, ముప్పు తన మీదకే ముంచుకొచ్చింది.

* * *

నారాయణమూర్తి తన ఇంటికి వచ్చిన కారణాన్ని ఏమాత్రమో వూహించగలిగింది శారద.

ముక్తసరిగా పలకరించి 'కూర్చో' అన్నది.

తనకంటే చిన్నదయినా, మాతృస్థానంలో వున్న వ్యక్తితో సూటిగా అలాంటి విషయాన్ని ఎలా ప్రస్తావించాలో తెలియలేదు నారాయణమూర్తికి.

కొద్దిసేపు గడవటాయింది, 'మీరిలా పలుగురు వోళ్ళతోనూ వడ్డం బావులేదు. కొన్నాళ్ళు మీరు మరెక్కడైనా వుంటే మంచిదేమో' అన్నాడు డొంక తిరుగుడుగా.

'ఎందుకని?' ఆశ్చర్యంగా అన్నది శారద.

'ఇక్కడ గొడవలు కొంత సద్దుమణుగుతాయి' అన్నాడు సౌమ్యంగా. శారద వదనంలో వెలిసిపోయిన హాసరేఖ ఒకటి మెరిసింది.

'నేను ఎక్కడవుంటే అక్కడ గొడవలు తల ఎత్తుతూనే వుంటాయి. వాటికి భయపడి పారిపోదలుచుకోలేదు నేను' అన్నది దృఢంగా, ఆయనవంక చూడకుండానే.

ఆమె ధోరణి తెంపరితనంగా అనిపించింది నారాయణమూర్తికి. కొద్దిగా కోపం వచ్చిందతనికి.

'ఎక్కడవున్నా మీ ప్రవర్తన తిన్నగావుంటే ఇలాంటి గొడవలు తల ఎత్తే ఆస్కారం ఎందుకుంటుంది?' అనేశాడు దురుసుగా.

ఆ విమర్శ ఆమె అహాన్ని దెబ్బగొట్టి ద్వేషాన్ని రేకెత్తించింది. శారదకీ తెగువ వచ్చేసింది.

'నిజమే. నా నడత మంచిదికాదు, కాని దానికి బాధ్యులు మీరే.'

'మేమా?' విస్తుపోయాడు నారాయణమూర్తి. మరుక్షణంలో అతని మొహం ఆగ్రహంతో కందగడ్డలా తయారయింది.

'ఇంటి మర్యాద మంటగలిపి ఇలా తెగించి వొళ్ళమ్ముకోమన్నామా మేము?' తీవ్రంగా అడిగాడు. చేయి విరిగిన కుర్చీలోంచి చివాలున లేచాడు.

జంకలేదు శారద. 'అవును. మీరు నాకంటూ మిగిల్చింది అది ఒక్కటే. నా బ్రతుకు జూదంలో నాకెందుకు అది మనసా నాకేముందని?' కొరకొరా చూస్తూ అన్నది శారద.

అంత కట్టె విరిచినట్టు బయటపడు తుందనుకోలేదు నారాయణమూర్తి. నీళ్ళు చిలకరించినట్టు చల్లబడిపోయాడు.

'అంత లేని పరిస్థితులు వచ్చినప్పుడు మాకెందుకు తెలియజేయలేదు?' అన్నాడు ఇబ్బందిగా మొహంపెట్టి.

'అగుదునంటూ చెప్పవచ్చావుగానీ, నాకూ నా పిల్లలకీ, నువ్వూ - నీ తమ్ముడూ వాదిలి వెళ్ళిన ఆధారమేటి? నీ తండ్రిని కట్టుకున్న ఆడదాని బ్రతుకు విలువ ఏమయితేనేమని, సర్వమూ వొల్లుకుని, నా మానాన నన్ను వదిలి మీదారి మీరు చూసుకున్నారే ఆనాడు. అలాంటి నన్ను దేహీ అని చెయిజాపితే ముష్టి వేశేవాడినా పాపం?'

వెంటనే సమాధానమేమివ్వాలో తెలియక తికమక పడ్డాడు నారాయణమూర్తి. కొద్దిసేపు వారి మధ్య నిశ్శబ్దంగా కొన్ని క్షణాలు గడిచాయి. చివరకు నారాయణమూర్తే పెదాలు తడుపుకుంటూ అన్నాడు.

'సరే. అయినదేదో అయిందనుకోండి. ఇకముందు మీకు మనోవృత్తి ఏర్పాటు చేస్తాము. మీరు ఈ వాటా అద్దెకిచ్చేసి మీ పుట్టింటికి వెళ్ళివుండటం మీకూ మాకూ గూడా మంచిది!' అంతటితో ఆ సంభాషణ తుంచెయ్యటం మంచిదని పించిందతనికి.

కాని శారదకు అతని ఎత్తుగడ అర్థం కాలేదు. 'ప్రస్తుతం తననిక్కణ్ణించి తొలగించి ఏ పబ్బమో గడుపుకుందామని

# రచయితలకు మనవి

## కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాతప్రతులని తిప్పించగోరే రచయితలు వ్రాతప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్ళలు అతికించిన స్వంత చిరునామాగల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రమే పంపరాదు. స్టాంపులు మాత్రమే పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పించబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికి కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పించబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

## నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాగల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంపనవసరం లేదు. 100 అరఠావు పేజీలు పైబడి ఉన్న వ్రాతప్రతులే నవలకింద పరిగణించబడుతాయి.

## కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్‌లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాగల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పించే ప్రయత్నాలు చేస్తాము. కాని, వాటి విషయంలో ఎటువంటి బాధ్యతలనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చూస్తున్నాడీ మేధావి! మనోవృత్తి ఇస్తాట్ట—మనోవృత్తి! ఎంతిస్తాడో బారుగా! ఎన్నాళ్ళిస్తాడో పాపం! వాగ్దానం చాలా జాగ్రత్తగానే ఇస్తున్నాడు పుత్రరత్నం. తన యింటికి వచ్చెయ్యమనటం లేదు. ఈ ఆడపిల్లల పెళ్ళిళ్ళు నెత్తిన పడవూ? ఒకటా రెండా మూడు కుంపట్లు గుండెలమీదకి! మనోవృత్తి ఇస్తానేదాకా ఇతని దాతృత్వం పెరిగిందేమిటబ్బా అని ఆలోచించింది శారద.

'కృతజ్ఞురాలిని. కాని నాకిక యెవరి దయాధర్మ భిక్ష అవసరం లేదు' అన్నది పెళుసుగా.

'మరి ఇక మీ మనసు మార్చుకోరన్నమాట!' తీవ్రంగా మారిందతని కంఠస్వరం.

'నాకా అవసరం కనిపించడం లేదు' ప్రశాంతంగా సమాధానమిచ్చింది శారద.

'అన్నిటికీ తెగించిన మీకు కనిపించకపోవచ్చు. కాని పరువూ— మర్యాదా కోసం ప్రాకులాడే వాళ్ళం. మీ వల్ల మేమెంత అవస్థల పాలవుతున్నామో తెలుసునా మీకు? ఈ కారణంగా మా అమ్మాయి కొచ్చిన సంబంధాలన్నీ తిరిగి పోతున్నాయి ఖర్మ' నెత్తి బాదుకొన్నాడు నారాయణమూర్తి.

అదీ ఈయన కొచ్చిన విపత్తు! శారదకి చటుక్కున స్ఫురించింది.

'అదా తమరి అకాల వాత్సల్యానికి కారణం!' వ్యంగ్యంగా అన్నది శారద—

'నన్ను దిక్కుమాలినదాన్నిచేసి గాలికి వదిలేసిననాడు లవలేశమైనా పుట్టుకురాని దయారసం, ఈనాడు కూతురి భవిష్యత్తుకి నా అప్రతిష్ఠ అడ్డుగోడగా నిలబడేసరికి పొంగులు వారుతున్న దన్నమాట! కానీ నాదీ ఒక విధంగా మీలాటి పరిస్థితే నాయనా. మీ పిల్లలకోసం మీరెలా తాపత్రయపడుతున్నారో అలాగే నా బిడ్డలు ఆకలిదప్పులతో అల్లాడిపోకుండా వుండాలని నేనూ ఒక దారి తొక్కాను. అది మంచో చెడ్డో నాకు నిమిత్తం లేదు. తెగించినదని అనుకుంటే అనుకోండి— పరువూ—ప్రతిష్ఠ అనేవి మీకు కావాలి పొచ్చిన ఘట్టమిది. నాకవి విడిచిపెడితేనే తప్ప గత్యంతరం లేని పరిస్థితి. అంతే తేడా. నేనూ నా సంతానమూ రోజుల తరబడి పస్తులున్నప్పుడు మీరిప్పుడన్నారే పరువూ—ప్రతిష్ఠా, మానం మర్యాదా అని? అవేవీ అక్కరకి రాలేదు నాకు. జారవిడుచుకున్న మాన మర్యాదలు నాకెలాగూ ఛస్తే తిరిగి రావు. మళ్ళీ నన్ను ఆ రొచ్చులోకి లాగి వంచన చెయ్యాలని ప్రయత్నించకండి. నన్నిలా బ్రతకనియ్యండి.' మరిక చెప్పాలిసింది లేనట్టు గిరుక్కున తిరిగి లోనికి వెళ్ళి పోయింది శారద—గొంతులోని దుఃఖాన్ని పంటితో నొక్కిపట్టి.

ఇక లాభం లేదనుకొని వచ్చిన దారి పట్టాడు నారాయణమూర్తి.

నాలుగు రోజులు గడిచాయి. ఒకనాటి సుప్రభాతాన తల్లిని వెంట బెట్టుకొని భాగ్యమ్మ దిగబడింది.

ఇదంతా నారాయణమూర్తి ప్రభావమేనని శారద గ్రహించుకున్నది.

వచ్చినప్పటినించీ భాగ్యమ్మ అంతటా కలియతిరుగుతూ ఇంటినీ, ఇల్లాలినీ పట్టి పట్టి పరిశీలిస్తూనే వున్నది. ఆమెకు నారాయణమూర్తి ఉత్తరంలోని సారాంశమేమీ అసత్యంగా కనిపించలేదు.


ఇంట్లో అదివరలో లేని సొగసేదో చోటు చేసుకొన్నది. శారద మెడలో సన్నటి గొలుసొకటి తళుక్కుమంటున్నది. ఆ మెడ బోసిగా వున్నప్పుడూ, అందంగా వొంపులు తిరిగిందేను.

తన రాకకి అదరక, బెదరక, చెదరక పూర్వంలానే ఏమీ ఎరగనట్టు ప్రవర్తించే చెల్లెలిపట్ల అసహ్యమూ, తిరస్కారమూ పెచ్చురేగాయి భాగ్యమ్మలో.

కానీ తొందరపడి ఘర్షణకు దిగవద్దని తల్లి ముందే హెచ్చరించడంవల్ల తమాయించుకున్నది.

రాత్రి భోజనాల అనంతరం పిల్లలు నిద్రకు పడ్డారు. తల్లీ కూతుళ్ళిద్దరూ పక్కలమీద ఒరిగి ఇష్టాగోష్ఠికి దిగారు. భాగ్యం వాళ్ళ సంభాషణలో పాలు పంచుకోలేక చెల్లెలిమీద దెబ్బ తీసే తరుణం కోసం ఎదురుచూస్తూ పక్కమీద ఇబ్బందిగా మెసులుతోంది. తల్లి చేస్తున్న జాప్యానికి చిరాకు పడుతోంది.

ఉన్నట్టుండి తల్లి 'అయితే మీ నారాయణమూర్తికి నీమీద ఇంత అక్కసు ఎందుకు రేగింది శారదా? నీవు పూర్తిగా పతనమైనావనీ, వూరూ నాడూ నీవైపు వేలెత్తి చూపిస్తూందనీ, మరి ఏవేవో అవాకులూ—చవాకులూ వ్రేలుతూ ఉత్తరం రాశాడు సుమా!' అన్నది రంగులు మారే కూతురు మొహంలోకి పరీక్షగా చూస్తూ. అవన్నీ నిజం కాకూడదనే కొండంత ఆశ మనసు నిండా నింపుకునే వచ్చిందిక్కడ కావిడ. కాని క్షణక్షణమూ



ఆ ఆశ నిరాశగా మారబోతున్నదనీ, కఠోరమైన సత్యం తనముందు నిలబడి వెక్కిరించ బోతున్నదనీ ఆమెకు తెలియదు.

ఈ క్లిష్ట పరిస్థితిని తానెదుర్కోవలసి వస్తుందని ముందే తెలుసు శారదకి. అయితే వీళ్ళందరినీ మభ్యపెట్టి, తప్పించుకొనే పిరికితనమూ ఆమెకు లేదు. బుద్ధిమంతనంగా మొహం పెట్టి నటనలు సాగించాలనీ లేదు. నిజమెప్పుడూ నిప్పులాంటిది. దాచినవారిని దహిస్తుంది. కాని, తనమీద అంత నమ్మకంతో ఆప్యాయతగా అడుగుతున్న తల్లికి తన పరిస్థితిని అంత సౌమ్యంగానూ తెలియచెప్పటమెలాగా అని ఆలోచిస్తూ మౌనంగావుండిపోయింది శారద.

ఆ మౌనం అర్ధాంగీకారంగా తీసుకొన్న భాగ్యమ్మ మరి వుండబట్టలేక,

'అయితే మేము విన్న సంగతులన్నీ నిజమే నన్నమాట' అన్నది చెల్లెలి వంకర నడకని ధ్రువపరుస్తూ.

తల్లిపట్ల చూపవలసిన మెత్తదనం అక్కయ్యతో అవసరం లేదనిపించింది శారదకి. దానితో కొత్త ధైర్యం పుంజుకొన్నది.

'ఏమిటి నీవు విన్నది? నీ చెల్లెలు చెడిపోయిందనీ, ఒళ్ళు అమ్ముకొనే పోపతిత అయిందనీ, అంతేనా? కానీ ఆ దోషం నాది కాదు. నా దరిద్రానిది.'

'అయితే నువ్వు బుద్ధిమంతురాలివే గనీ పొట్ట గడవక చీకటి తప్పుకి దిగావంటావ్?' అన్నది భాగ్యం వెటకారంగా.

శారద ఆ హేళన పట్టించుకోలేదు.

'ఔను. నా చుట్టూ గిరి గీసుకొని నా శీలాన్ని అపురూపంగా చూచుకున్నన్నినాళ్ళూ, నన్ను నమ్మినవారు లేరు. ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటూ గౌరవంగా బ్రతకాలనుకున్నన్నినాళ్ళూ నాకు చేయూత నిచ్చినవారు లేరు. ఎందుకలా జరిగింది? తోడబుట్టినదానివి నీవే నన్ను నిష్కారణంగా దుయ్యబట్టావు. నలుగురు నిలా అరడి చేశావు. పాటివారిలో చులకన అయ్యాను. ప్రతి పింజారీ సందేహించాడు నన్ను. అప్పట్నించీ ఒక విష వలయంలో చిక్కుకున్నాను నేను. అందరూ నన్ను కటిక దరిద్రంలోకి తోసి పూరుకున్నారు. నా మొహాన కులట అని ముద్ర వేశావు నువ్వు. అందరి కళ్ళూ నామీద పడ్డాయి. నా పతనానికి కారణం కొంతవరకూ నీవే. ఈ వేళ నీతులు బోధించవచ్చిన నీవు నా వివాహానికి ముందే కొంత స్వార్థం విడిచి వుంటే, నే నిలా నా అన్న వాళ్ళందరికీ కంటకప్రాయంగా తయారయ్యేదాన్ని కాదు—' గుక్క తిప్పుకోడానికి ఆగింది శారద. తెల్లగా పాలిపోయిన మొహానికి చీకటిని చాటుగా చేసుకున్నది భాగ్యం.

ఇప్పటివాకా నోరావలించి కూతుళ్ళ వాదన వింటున్న తల్లి, భాగ్యం అవస్థ కని పెట్టి; 'మా స్థితిగతు లెరగనిదానివా అమ్మాయ్! ఎంత కుమిలిపోతో ఈ రెండో పెళ్ళికి ఒప్పుకున్నదీ నీకు తెలియదా?' అన్నది విచారంగా.

భర్త పోయినప్పటి నించీ ఎంతెంత అవస్థలు పడిందీ ప్రొద్దుటినించీ శారద నోటంట వింటూనే వున్నదావిడ. అంచేత గట్టిగా మందలించ లేకుండానూ వున్నది. అలాగని తప్పు కాదని సమర్థించుకో లేకుండానూ వున్నదావిడ.

'నేను మీ తప్పులెన్నటం లేదమ్మా. మీ శక్తి నాకు తెలుసును. అందుకే, మీ నియమ నిబంధనలకు ఒదిగి మీరందరూ పసుపు తాడని చెబితే సరేనని ఆ పరిణాడు నా మెడకు తగిలించుకున్నాను. ఇప్పుడు నన్నర్థం చేసుకోమంటున్నాను అంతే. ఒక పరిస్థితిలో ఒక దురాచారానికి లొంగిపోయారు మీరు. అలాంటి పరిస్థితుల్లోనే ఒక దుర్నీతికి లోబడిపోయాను నేను. అంతే తేడా.'

ఆమె సమర్థన తల్లికి నచ్చుబాటు కాలేదు.


'ఎంత కాలికాల మొచ్చినా నీతి తప్పటాన్ని లోకం హర్షించదమ్మా' అని నిట్టూర్చిందామె. 'హు. లోకం! నేనూ నా బిడ్డలూ కడుపులు మాడ్చుకుంటుంటే గుడ్లప్పగించి చూస్తూ నిలుచున్న లోకంతో నాకేం పని?' నిర్లక్ష్యంగా అన్నది శారద, 'పద్దెనిమిదేళ్ళ మొగ్గను ఒక ముసలిపగ్గుకు ముడిపెడుతూంటే వద్దనలేదే ఈ లోకం? ఆడదాన్ని, వెనకానరా లేనిదాన్ని, అన్యాయంగా అయినవాళ్ళే వీధిలోకి విసిరేస్తుంటే చూస్తూ కాదని వారించలేక పోయిందే ఈ లోకం? ఈ లోకానికి ఎందుకు భయపడాలి నేను?' ఆవేశంగా అన్నది శారద.

ఆ సమయంలో ఏమి చెప్పినా కూతుర్ని ఒప్పించటం కష్టమనిపించింది తల్లికి. ఒంటరిదై పసిబిడ్డ ఎంత మనస్తాపం పొంది, ఎంత రేమి అనుభవించి ఈ రొంపిలోకి దిగబడ్డదో అర్థమయి పోయింది ఆ




1. మహాత్మ (ఆత్మకథ) వెల 2-00
2. మహాత్మ—ఆంధ్రప్రదేశ్ ,, 2-00
3. గాంధీజీ కనిన కలలు ,, 1-00

పోస్టు ఖర్చులు అదనం.
3 పుస్తకములకు రూ. 3—00
1 పుస్తకమునకు రూ. 1—00
ముందుగా పోస్టు ఖర్చులతో ఆర్డర్లు పంపాలి.
వివరాలకు: మహాత్మా ప్రచురణ సమితి,
1-1-287/20/A బాపునగర్,
హైదరాబాదు—20.




రైల్వే స్టేషన్ వద్ద: రామాలయం వీధి.

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టరు
స్టాండర్డ్
(గ్యారంటీతో)



నెలకు రు. 5/-వంతున
చెల్లించి, 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ పొందండి. ప్రతి గ్రామమునకు పట్టణమునకు పంపగలము. వివరములకు :

AMBA AGENCIES (60)
Model Town, Delhi—9.

35 సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్టు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటీగా బాగువేయబడును
వివరములకు:
రే అండ్ కో ఆసుపత్రి
గౌలిగూడ సయబస్‌డిపో ఎదుట.
హైదరాబాద్-12
ఆఫీసు ఫోన్: 42870. ఇంటిఫోన్: 45426.

# అబల

మాతృ హృదయానికి. మగ రెప్ప కొట్టకుండా కూతురి తల నిమురుతూ వుండిపోయింది.

ఆ రాత్రి పూర్తిగా నిద్రపోయిన వాళ్ళు సమస్యలూ, సంతాపాలూ ఇంకా అంటని పిల్లలొక్కరే.

మర్నాడు ఇంటో ఏదో ప్రశాంతత కమ్ముకుంది. కాని ఎవరి మనసులోని ఆందోళనలు వారి కుండనే వున్నాయి.

ఆగి, ఆగి తల్లి శారదను బతిమాలాడుతోంది. 'తనతో వచ్చెయ్యమనీ, అదివరకటిలాగే గడుపుకుందామనీ, నారు పోసినవాడు నీరుపొయ్యడా అనీ'—మనసు నొవ్వకుండా, మాట కరుకు లేకుండా నచ్చ చెబుతోంది.

శారద ఎంతకూ ఇష్టపడ్డం లేదు.

'రమ్మంటూ ఒత్తిడి చేసి నన్ను ఇరకాటంలో పెట్టొద్దమ్మా' అంటోంది విసుగ్గా.

'నా ప్రారబ్ధానికి లోబడి తల వంచాను. నన్నింక వుద్ధరించడానికి ప్రయత్నించకండి' అని కళ్ళు ఒత్తుకుంటోంది.

'నాకా అవకాశమూ లేదు—అవసరమూ లేదు' అని తలాయిస్తోంది.

చెల్లెలి పెడసరితనం భాగ్యానికి ఒళ్ళు మంటగా వుంది. 'వంశగౌరవమూ బుగ్గిపాలవుతోంది; బంధుకోటిలోనా తలవంపులు; చెల్లెళ్ళ పెళ్ళిళ్ళున్నాయింకా. ఎట్లా గట్టెక్కను? ఎలా తెగించిన ఈ చిత్రాంగిని దారికి తీసుకు రావడం? అది చెడింది సరే. దాని పాపం త్రాచుపామై ఎందరిని కాటెయ్యబోతున్నదో గ్రహించదేమిటి ఖర్మ!' లోలోపలే మల్లగుల్లాలు పడిపోతోంది భాగ్యం.

పైకన్నట్టయితే — 'నాగతి మీరు చూశారా?' అని అంటుందేమోనని భయం. అదీ నిజమే మరి. స్వార్థం స్వార్థాన్ని సృష్టిస్తుంది.

'కూటికోసమే ఈ తప్పు డు త్రోవ తొక్కిందయితే నారాయణమూర్తి మనోవృత్తి ఇస్తే నన్నవ్వాడైనా తన ప్రవర్తన మార్చుకోవచ్చునుగా! చూస్తే దీనికా వంకరబాటే బాగున్నదన్న మాట! మరి తిండికి లేకే చీకటి తప్పు చేస్తున్నానని చెప్పుకోదు.

అనుకోకుండా ఎందుకు? తనలోనే ఆ పాపం విజృంభిస్తున్నట్టు ఎందుకు ఒప్పుకోదు?—ఆ మాటడిగితేనో? — అమ్మో తెగించినదాయెను—'నా వయసుకది సహజమేగా' అనవచ్చు. 'మొదట్లోనే, నా బతుకులో తియ్యని దారులన్నీ మూసుకు పోయిన సంగతి మర్చేరగనా?' అని ఎదురు తిరగవచ్చు. ఇంకెవరికైనా చెప్పవచ్చు గాని దాని మాటకు సమాధానం చెప్పగలమా' భాగ్యం లోలోపలే పీక్కుంటోంది.

ఆ రోజూ గడిచింది—

మరునాడు లేస్తూనే తొందరగా కాలకృత్యాలు తీర్చుకున్నది శారద. స్నానాదికాలు ముగించుకున్నతరవాత టెంకాయా పూజాద్రవ్యాలూ తీసుకుని శివాలయానికి వెళ్లొస్తానని తల్లితో చెప్పి బయలుదేరింది.

'చేస్తిని శివపూజలూ — దూరేనిదొమ్మరి గుడిసెలూ.' అనుకుంటూ వాసలు చిట్లించింది భాగ్యం.

తన పాదాలవద్ద ప్రణమిల్లే పతితులనూ, పవిత్రులనూ పక్షపాతం లేకుండా అందరినీ తలా వొకదారినీ చేరదీసి తనలో కలుపుకునే ఆ దేవదేవుడికి చెయ్యెత్తి నమస్కారం చేసింది శారద.

ప్రసాదం తీసుకుని ప్రాకారం లోపల పచ్చగన్నేరు చెట్టుకింద సిమెంటు దిమ్మ మీద విశ్రాంతిగా కూర్చున్నది కాస్సేపు.

ప్రాతఃకాలం ప్రశాంతంగా వుంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో గుడి ఆవరణంతా మరీ పవిత్రంగా మెరిసిపోతోంది. విచ్చే మొగ్గలతో, విచ్చిన పువ్వులతో, వేద జల్లే పరిమళాలతో, మంచుబొట్లు రాలుస్తున్న పచ్చని చిగురాకులతో మనోహరమైన ప్రకృతి సింగారించుకొని పరమేశ్వరుడికి నీరాజనం వడుతోంది. ఇంకా గుడిలో సందడి అంతగా లేదు. అప్పుడప్పుడు భక్తులు మోగించే ఘంటారవాలు నివురుగప్పిన గుండెలోతుల నించీ భక్తిభావాన్ని రగిలించి పారవశ్యంలో ముంచెత్తుతున్నాయి.

శారదకు లోపల బరువేదో దింపుకున్నట్టయి మనస్సులో కల్మషమేదో విరిగి పట్టయి, తేరుకుని నిర్మలంగా హాయిగా వుంది. మనుషుల తమలో లేని ప్రశాంత

తనీ, పవిత్రతని కేటాయించి ఈ కోవెల చుట్టూ పేర్చి పెట్టారా అనిపించింది. ఆ గాలి స్వేచ్ఛగా లోపలికి పీల్చుకుని ఒక్క క్షణమైనా కళ్ళు మూసుకుంది శారద.

వెళ్ళేముందు గబగబ దోసెడు గన్నేరు కాయలు ఒడిలో పోసుకున్నది. మరో సారి దేవుడికి మనసారా నమస్కరించి బయలుదేరింది.

భోజనంచేసి మధ్యాహ్నం మనగా పడు కున్న శారద ప్రొద్దు వాలిపోతున్నా లేవక పోయేసరికి అనుమానంగా ముసుగు తొలి గించింది భాగ్యం. పక్కమీద ఉన్న గన్నేరుకాయల తొక్కలు పడివున్నాయి. అస్తవ్యస్తంగా పడి వున్నది శారద. శరీరం కట్టెలా బిగదీసుకుంటున్నది. ఒళ్ళు జల్లుమంటే తల్లి దగ్గరకు పరుగెత్తింది భాగ్యం. గొల్లుమంటూ దగ్గరకు చేరింది తల్లి.

ధైర్యాన్ని కూడగట్టుకుని భాగ్యమే చెల్లెలి ముఖాన ఇన్ని నీళ్ళు చల్లింది, వుల్లిపాయ నలిచి ముక్కు దగ్గర పెట్టింది. తనకు తెలిసిన విరుగుళ్ళు ఏవేవో చేసింది.

కొంత సేపటికి బరువుగా రెప్పలు విప్పింది శారద.

వూపిరి పీల్చుకున్నారు తల్లీ, కూతు ళ్ళిద్దరూ.

'నువ్వు ఇక్కడే వుండమ్మా. నే నెవరి నన్నా అడిగి డాక్టర్ని పిలుచుకు వస్తాను' అంటూ బయలుదేరబోయిలది భాగ్యం.

కష్టంమీద చెయ్యెత్తి ఒద్దని వారించింది శారద. కళ్ళతో అక్కను చేర బిలిచింది, మెల్లగా నోరు విప్పింది.

'ఒద్దు. లాభం లేదు. అంతా అయి పోయింది. ఎవరినీ పిలవద్దు......అల్ల రయిందా మీ మానమర్యాదలు ముగుగు కాలవలో వుంటాయి. పోలీసులొస్తారో— అదో చక్రబంధం...' ఆయాస పడుతూ ఆగింది శారద. నాలిక పిడచ గట్టుకు పోతోంది. లోపల ఏముకలు విరిగిపోతు న్నట్టు బాధ. పోట్లో గుడ్డ కుక్కు కుని గుండెలదిరేలా ఏడుస్తున్నది తల్లి. గట్టిగా పైకి ఏడ్చే వీలు కూడా లేదామె.

'ఎంత అఘాయిత్యం చేశావే తల్లీ' అంటూ లబలబ లాడుతున్న తల్లి వంక జాలిగా చూసి, శారద అక్కయ్య వేపు తిప్పింది మాపులు.

'లోకానికి భయపడనన్నదానిని యిలా ఎందుకు చేశాననుకుంటున్నావా అక్కా? నేనే వోడిపోయానమ్మా! లోకం కూసే కారుకూతలకి జడవలేదు. నిర్లక్ష్యంగా నిలవగలిగాను కాని దేవుడికే దయ లేదు. నా నేరం మూట గట్టి నా నెత్తికెత్తి, ఒక ముద్ర వేసి నన్ను అందరి ముందుకే నెట్టాలని ఆయన సంకల్పం. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ ముద్ర నించి తప్పించుకోలేకపోయాన్నేను.'

అయోమయంగా వున్నాయామె మాటలు. సంధించిందేమో అనిపిస్తోంది అందరికీ. కాని శారద తెలివిగానే వున్నది. జారిపోయే శక్తినంతా కూడగట్టుకుంటూ మాట్లాడటానికి ప్రయత్నిస్తోంది.

ఆ స్థితిలో తల్లినెప్పుడూ చూచి ఎరగని పిల్లలు బిక్కచచ్చి అమ్మమ్మను చుట్టేసుకున్నారు. వారి వంక ఆప్యా యంగా చేతులు జాపబోయి బలవంతాన ఆపుకున్నది శారద.

తల్లిపోసిన తులసి తీర్థంతో మళ్ళీ గొంతు విడింది, 'ఈ ముగ్గురు నిర్భాగ్యు లకు తోడు మరో దౌర్భాగ్యజీవిని ఈ లోకంలోకి తీసుకువచ్చే సాహసం లేక నేనే వెళ్ళిపోతున్నాను.' అంటూ ఒక చేతిని అక్క ఒడిలో వేసి,

ఒక అనాథ, ఒక పతిత భూ భారం తగ్గిస్తున్నందుకు నీవూ, నేనూ సంతో షిద్దాం. కాని నా లాంటి వికృష్ట జీవులు ముగ్గుర్ని వదిలిపోతున్నాను. వాళ్ళని నాలాగే జారుడు బండలమీద వదలవు కదూ? ఆ హామీ ఇవ్వగలవా అక్కా' అన్నది శారద జాలిగా చూస్తూ.

భాగ్యం తల వంగిపోయింది. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. చెల్లెలి చెయ్యి చేతుల్లోకి తీసుకుని మృదువుగా నొక్కుతూ 'అలాగే' అన్నట్టు తల వూపింది.

కళ్ళెదుట ఒక ప్రాణి గిలగిల కొట్టు కుంటుంటే చేతులు ముడుచుకు కూర్చో వలసి రావటం ఎంత ఘోరం!

గడ్డు క్షణాలు గడిచిపోయాయి.

బ్రతికి వున్నన్నాళ్ళూ ఏటి కెదురీది అలిసిపోయిన శారద, సుడిగుండంలో గిర్రున తిరిగి మృత్యువు కవుగిట్లోకి హాయిగా ఒరిగిపోయింది.

మా ఆయనకి కోపం వచ్చినప్పుడల్లా నా చెవులు పట్టి సాగదీస్తాడనుకుంటున్నాను!

